క్లుప్తంగా

ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న ఏడీఎఫ్‌వో వరప్రసాద్

శ్రీకాకుళం క్రైమ్: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక సహాయాధికారి వరప్రసాద్ అన్నారు. గురువారం శ్రీకాకుళం నగరంలోని 80 ఫీట్ రోడ్డులో ఓ ప్రైవేటు స్కూల్‌లో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు, నదుల్లో ప్రమాదవశాత్తు పడిపోయినప్పుడు ఎలా రక్షించుకోవాలి, ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పి.దుర్గారెడ్డి, బి.అప్పారావు, ఎల్.రమణ, వై.పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో ఆరోగ్యం జాగ్రత్త



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సుమబిందు

జి.సిగడాం: వేసవి ఎండలు నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని జి.సిగడాం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పేకల సుమబిందు అన్నారు. గురువారం పెంట గ్రామంలో ప్రజలకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జి.భవాని , ఎంఎల్‌హెచ్‌పీ సుభాషిణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మిరియాల చెరువులో ఆక్రమణలు తొలగించాలి



కళింగపట్నంలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

గార: కళింగపట్నం మెయిన్‌రోడ్డు పక్కనే పురాతన మిరియాల చెరువులో ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరారు. గురువారం కళింగపట్నం సచివాలయం వద్ద సర్పంచ్ టి.మౌనికారాణి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ శ్రీధరరెడ్డి మాట్లాడుతూ చెరువులను రక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గతంలో చెరువుల అభివృద్ధికి నిధులు వెచ్చిస్తే ఇప్పుడు ఆక్రమణలు చేయడం చట్టవిరుద్ధమన్నారు. గ్రామసభలకు 29 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉన్నా తూతుమంత్రంగా నిర్వహించడంపై ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక సభ్యుడు ముంజేటి బాబు సాయిరాం అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల అలసత్వం కారణంగా ప్రజల కనీస అవసరాలు చర్చకు రాకుండా మరుగునపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం: స్థానిక మున్సిపల్ కార్యాలయం వెనుక కల్యాణ మండపం సమీపంలో ఈశ్వర్ ఆర్ట్స్, డిజిటల్స్ సంఘ సేవకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, ధనలక్ష్మి, బొనెల పరుశురాం, లీలారాణి, విద్యాశ్రీ, సుమిత్ర, రియాజ్, ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న బాబా

జి.సిగడాం : ఆనందపురంలోని వంద అడుగుల ఎత్తుగల వెంకటి సాయికోటి మహాస్థూపం, 46 అడుగుల నాగసాయి విగ్రహం వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాత మక్క వెంకటిసాయి, సాయి భక్తులు పాల్గొన్నారు.

19 నుంచి ప్రవచనాలు

శ్రీకాకుళం కల్చరల్ : స్థానిక ఉపనిషన్మందిరం ప్రవచనకర్త నిష్టల నర్సింహమూర్తి ఆధ్వర్యంలో గుంటూరు శారదా పరమేశ్వరీ దేవస్థానంలో 'శ్రీరామయణ రహస్యములు' అనే అంశంపై ఐదు రోజుల పాటు ప్రవచనాలు జరుగుతాయని మందిర ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 23 వరకు ప్రతి రోజూ సాయంత్రం జరిగే ఈ ప్రవచనాలను యూట్యూబ్ ద్వారా కూడా వీక్షించవచ్చని పేర్కొన్నారు.

రక్తదాతా సుఖీభవ!

- తలసేమియా రోగులకు ఉచితంగా రక్తం పంపిణీ
- బాధితులకు అండగా నిలుస్తున్న రెడ్‌క్రాస్
- ఇప్పటివరకు 121 మంది నమోదు
- 3642 యూనిట్లకు పైగా రక్తం సరఫరా

శ్రీకాకుళం కల్చరల్: తలసేమియా.. రక్తహీనత, అలసట, ఆకలి మందగించడం, పిల్లల్లో శారీరక ఎదుగుదల లేకపోవడం, ఎముకల బలహీనత, పొట్ట భాగంలో నొప్పి, కామెర్లు, మూత్రం ముదురు రంగులో కనిపించడం, తరచుగా ఇన్‌ఫెక్షన్‌లకు గురికావడం తదితర లక్షణాలతో బాధితులు నిత్యం నరకం అనుభవిస్తుంటారు. వీరికి నెలకోసారి కొత్త రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. ఇదంతా ఖరీదైన వ్యవహారం. ఈ నేపథ్యంలో తలసేమియా రోగులకు రెడ్‌క్రాస్ సంస్థ అండగా నిలుస్తోంది. సంస్థ ద్వారా సేకరిస్తున్న రక్తంలో కొన్ని యూనిట్లను తలసేమియా బాధితులకు ఉచితంగా అందిస్తోంది. జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్‌లో ఇప్పటికే 121 మంది తలసేమియా బాధితులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరికి ప్రతినెలా 40 యూనిట్లు వరకు ఉచితంగా రక్తం అందజేస్తున్నారు.

తలసేమియా ఎలా వస్తుందంటే?

ఎర్ర రక్తకణాలలో హిమోగ్లోబిన్ తగినంతగా ఉత్పత్తి చేయలేకపోవడం వల్ల తలసేమియా వ్యాధి వస్తుందని వైద్యులు చెబుతున్నారు. శరీరంలోని వివిధ భాగాలకు ఆక్సిజన్ తీసుకెళ్లడంలో హిమోగ్లోబిన్ కీలక పాత్ర పోషిస్తుంది. కొన్ని జన్యుపరమైన లోపాల వల్ల కూడా తలేసేమియా వచ్చే అవకాశముంది. తలసేమియా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స తీసుకోవడం చాలా ముఖ్యం.



రెడ్‌క్రాస్ సేకరించిన రక్తం

జాగ్రత్తలు తప్పనిసరి..



తలసేమియా వ్యాధి ప్రమాదకరం. ఎప్పటికప్పుడు రక్తం తగ్గిపోతుంది. మళ్లీ కొత్తరక్తం ఎక్కించాల్సి ఉంటుంది. స్పెషలిస్టుల ద్వారా బోన్ ట్రాన్స్‌ప్లాన్‌టేషన్ చేయించుకుంటే మంచిది. – డాక్టర్ శ్రీకాంత్, రెడ్‌క్రాస్ వైద్యులు

2014 నుంచి సరఫరా..

తలసేమియా వ్యాధిగ్రస్తులు 121 మంది రెడ్‌క్రాస్‌లో వివరాలు నమోదు చేసుకున్నారు. వీరికి 2014 నుంచి ఇప్పటికి నిరాటంకంగా రక్తం సరఫరా చేస్తున్నారు. ఇప్పటివరకు 3642 యూనిట్లకుపైగా రక్తాన్ని ఉచితంగా అందజేశారు.

వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నవారిలో ఎర్ర రక్తకణాలను పెంపు చేయడానికి 15 నుంచి 20 రోజులకొకసారి రక్తం ఎక్కించుకోవాలి. బోన్‌మ్యారో ప్లాంటేషన్ ద్వారా రక్తం ఎక్కించే అవసరాన్ని తగ్గించవచ్చు.

ప్రతినెలా సరఫరా

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న నాకు అవసరమైన సమయంలో వెంటనే రక్తం అందిస్తున్నారు. దీంతో జీవితం కొనసాగిస్తున్నాను. రెడ్‌క్రాస్ ద్వారా 2009 నుంచి ప్రతి నెలా రెంటు యూనిట్లు వరకు రక్తం ఇస్తున్నారు.
– జి.ప్రియాంక, తలసేమియా బాధితురాలు

ఉచితంగా సేవలు..



మనిషి ప్రాణాలు కాపాడేందుకు రెడ్‌క్రాస్ ఎల్లప్పుడూ ముందుంటుంది. తలసేమియా, సికిల్‌సెల్ పేషంట్లకు 2014 నుంచి ఉచితంగా రక్తం సరఫరా చేస్తున్నాం.
– పి.జగన్మోహనరావు, రెడ్‌క్రాస్ చైర్మన్

మైన్స్ అధికారులు ఏం చేస్తున్నారు?

- అనుమతులకు మించి ఇసుక తవ్వకాలు చేస్తున్నా పట్టించుకోరా..
- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ నిర్మల మండిపాటు



అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీపీ అంబటి నిర్మల

శ్రీకాకుళం రూరల్: ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేస్తుంటే మైన్స్ అధికారులు ఏం చేస్తున్నారంటూ శ్రీకాకుళం ఎంపీపీ అంబటి నిర్మల మండిపడ్డారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బైరి గ్రామ పరిసర ప్రాంతంలో ఇసుకను మీటరు లోతుకంటే ఎక్కువగా తవ్వకాలు చేస్తున్నా ప్రజాప్రతినిధులు గానీ, మైన్స్ అధికారులు గానీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అయినా మైన్స్ ఇన్‌స్పెక్టర్ స్పందించకపోవడం గమనార్హం. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ సమీక్ష జరిగినప్పుడు బైరి గ్రామంలో లక్షన్నర నిధులతో ప్రభుత్వ స్థలానికి ఫెన్సింగ్ వేయాలని ప్రతిపాదనలు చేస్తున్నా పిల్లర్లు వేసి పనులు ఆపేయడం ఏంటని ఎంపీపీ మండల ఇంజనీరింగ్ అధికారి చక్రధర్‌ను ప్రశ్నించారు. దీనిపై ఆయన స్పందిస్తూ శ్రీకాకుళం ఎమ్మెల్యేకు స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పనులు నిలిపివేసినట్లు బదులిచ్చారు. వైద్యశాఖ సమీక్షలో సర్పంచ్ గంగు నరేంద్రకుమార్ మాట్లాడుతూ కల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పూర్తయి నాలుగు నెలలు కావస్తున్నా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదని, తమకున్న కమ్యూనిటీ భవనంలో ప్రస్తుతం పీహెచ్‌సీ నడుస్తోందని, సర్పంచ్‌గా మేం ఖాళీ చేయించేస్తామన్నారు. విద్యుత్‌శాఖపై సమీక్షలో కరెంట్ స్తంభాల ఏర్పాటు తొలగింపు ఇష్టారాజ్యంగా జరుగుతోందని ఎంపీటీసీ కనుగుల అప్పలనాయుడు మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్లు, డ్రైనేజీ, బిల్డింగ్ పనులు జరిగినా ఏ ఒక్కరికీ బిల్లులు పడటం లేదని, ఇటీవల కూటమి ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు మాత్రం మంజూరు చేస్తున్నారంటూ ఎంపీపీ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ రుప్ప దివ్య, ఎంపీడీఓ శైలజ, తహశీల్దార్ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ రెండు మండలాలకు.. బీసీ కార్పొరేషన్ రుణాలు లేనట్లే!

ఎచ్చెర్ల క్యాంపస్: నియోజకవర్గంలో ఎచ్చెర్ల, రణస్థలం మండలాలకు సంబంధించి బీసీ కార్పొరేషన్ రుణాలు తుదిజాబితా సిద్ధం కాలేదు. లావేరులో ఓ టీడీపీ నాయకుడు, జి.సిగడాంలో ఓ టీడీపీ నాయకుడు ఆయా మండలాల జాబితాలు సిద్ధం చేయగా నిబంధనలు, అర్హతతో పనిలేకుండా యూనిట్లు ఆన్‌లైన్ చేసినట్లు తెలిసింది. ఎచ్చెర్ల మండలానికి 717 యూనిట్లు, రణస్థలం మండలానికి 703 యూనిట్లు మంజూరు కాగా.. కూటమి నాయకుల మధ్య ఏకాభిప్రాయం కుదరక తుదిజాబితా సిద్ధం కావడం లేదు. గ్రామాల్లో ఎక్కువ మంది రుణాలు ఆశించటం, తక్కువ యూనిట్లు మంజూరు కావటం కారణంగా తెలుస్తోంది. ఫలితంగా నిర్ణీత సమయంలో అర్హుల జాబితాను మండల పరిషత్ అధికారులు అప్‌లోడ్ చేయలేకపోయారు. మరోవైపు బ్యాంకులు సైతం నిబంధనల మేరకే రుణాలు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. యూనిట్లు ఏర్పాటు కాకుండా రుణాలు తీసుకుంటే భవిష్యత్తులో సమాచార హక్కు దరఖాస్తు, ఫిర్యాదులు వంటి సమస్య వస్తుందని ముందే నాయకులకు అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రెండు మండలాల్లో రుణాల మంజూరు నిలిచిపోయినట్లు సమాచారం. తదుపరి విడతలో మంజూరు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ విషయంలో బీజేపీ, జనసేన కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా నాయకుల వైఫల్యంగా భావిస్తున్నారు.

కళాశాల టాపర్లకు సత్కారం



మాట్లాడుతున్న మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

శ్రీకాకుళం: విద్యార్థులు కష్టపడి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. గురువారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థినులకు గోల్డ్, సిల్వర్ బహుమతులతో సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌వోడీ ఎల్.కృష్ణారావు మాట్లాడుతూ బాగా చదువుకొని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలంటే అందుకు తగ్గట్టుగా ఎక్కువ సేపు చదవాలని, సమాజ సేవా కార్యక్రమాల్లోనూ పాలు పంచుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకర్ నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర, దేశ స్థాయి పోటీ పరీక్షల్లో పాల్గొని ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.ఆదిలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ మోహన్‌రాజు, లలితా బాయ్, సంతోషి పట్నాయిక్, కుమారి, పావని తదితరులు పాల్గొన్నారు.

లావేరు తహశీల్దార్‌గా రాజశేఖరరావు

ఎచ్చెర్ల: లావేరు మండల తహశీల్దార్‌గా కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న రాజశేఖరరావును డిప్యుటేషన్‌పై నియమించారు. ఇప్పటి వరకు తహశీల్దార్‌గా పనిచేసిన జోగారావును కలెక్టరేట్ హెచ్-సెక్షన్‌కు డిప్యూటేషన్‌పై నియమించారు. అయితే వీరిద్దరూ ఇంకా బాధ్యతలు స్వీకరించలేదు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడి

ఎచ్చెర్ల : నవధాన్యాల సాగుతో అధిక పంటల దిగుబడి సాధ్యమవుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శివకృష్ణ, అప్పారావు, సోమశేఖర్ అన్నారు. గురువారం లావేరు రైతు సేవా కేంద్రంలో వివిధ జాతుల విత్తనాలతో 25 కేజీల నవధాన్యాల కిట్లు తయారుచేసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో అధిక దిగుబడితో పాటు పంట ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటుందని చెప్పారు.

ముద్దాడ బాలలకు బహుమతులు

ఎచ్చెర్ల: రాజమండ్రి పట్టణానికి చెందిన జె.జె.పి. నెహ్రూ జ్ఞాపకార్థం మత్తి పవన్ ఆర్థిక సహాయంతో ఎచ్చెర్ల మండలం ముద్దాడ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బాలబాలికలకు గురువారం బహుమతులు అందజేశారు. ఇటీవల పలు కార్యక్రమాల్లో చూపిస్తున్న ప్రతిభను గుర్తించి వీటిని అందజేసినట్లు హెచ్‌ఎం మణిపాత్రుని నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ కర్రి నీలవేణి, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, పద్మజ, గణపతిరావు, శ్రీనివాసరావు, అమరావతి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి వై.అప్పయ్య, శ్రీకాకుళం ఒకటో డిపో కార్యదర్శి ఎంఎన్ రావులు మాట్లాడుతూ 1/19 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని, ఆర్టీసీ ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లు, అక్రమ తొలగింపులు వెంటనే ఆపాలని, పదోన్నతులు కల్పించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థపరంగా వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు ఎన్‌వీఆర్ మూర్తి, వి.డి.రావు, ఎంఎస్ రాజు, వీరబాబు, ఎస్.రమణమ్మ, భాగ్యలక్ష్మి, వి.శాంతి, పార్వతి, ఆర్ఎస్ చలం, ఎ.లక్ష్మణరావు, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం సంభవిస్తే..



అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో తోటి విద్యార్థులు చిక్కుకుంటే సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణాలు కాపాడాలని రణస్థలం అగ్నిమాపక అధికారి పైల అశోక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బంటుపల్లి పంచాయతీలోని ప్రైవేటు పాఠశాలలో గురువారం పైఅంతస్తులో చిక్కుకున్న విద్యార్థులను ఎలా రక్షించాలో సిబ్బంది చేసి చూపించారు. - రణస్థలం

సర్కారు బడుల్లో ఉత్తమ విద్య



ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ ముళ్ల శ్రీనివాసరావు అన్నారు. గురువారం బాతువ గ్రామంలో బడిబయట చిన్నారులను గుర్తించారు. పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్‌వీఆర్, మొయ్యి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు. - జి.సిగడాం

టెన్త్ విద్యార్థులకు అవగాహన



పదో తరగతి తర్వాత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కించుకునేందుకు అనేక రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయని సమగ్ర శిక్ష జీసీడీఓ నీరజ అన్నారు. సింగుపురం కేజీబీవీలో గురువారం సింగుపురం, గార, పోలాకి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి కేజీబీవీలలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు తదుపరి విద్యావకాశాలపై గురువారం అవగాహన కల్పించారు. మెంటల్ హెల్త్ కౌన్సిలర్స్ శ్రీధర్, రాజశేఖర్, ప్రిన్సిపాల్ లలిత, లక్ష్మి ప్రశాంతి, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు. - శ్రీకాకుళం/ శ్రీకాకుళం రూరల్

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలి



మాట్లాడుతున్న ఎంఈవో కె.పున్నయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బలోపేతం లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎచ్చెర్ల ఎంఈఓ కె.పున్నయ్య అన్నారు. ముద్దాడపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా బోధన అందిస్తున్న ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులను చేర్పించాలని కోరారు. ప్రభుత్వం పుస్తకాలు, యూనిఫాం ఉచితంగా అందజేస్తుందని వివరించారు. కార్యక్రమంలో బొంతలకోడూరు ఉన్నత పాఠశాల హెచ్ ఎం .ఆనందరావు, స్థానిక హెచ్‌ఎం బొడ్డేపల్లి విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో ముందుకు సాగాలి



మాట్లాతున్న మెంటల్‌హెల్త్ కౌన్సిలర్ సూర్యప్రభ

ఎచ్చెర్ల: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని మెంటల్ హెల్త్ కౌన్సిలర్ సూర్యప్రభ అన్నారు. గురువారం లావేరు మండలం మురపాక కేజీబీవీ పాఠశాలలో టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులకు మానసిక ఆరోగ్యం కౌన్సిలింగ్, కెరీర్ గైడ్‌లైన్స్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర శిక్ష కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డి, జిల్లా ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శశిభూషణరావుల ఆదేశాల మేరకు ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల ఫలితాలు ఎలా ఉన్నా కుంగిపోకుండా భవిష్యత్తు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. మార్కులు మాత్రమే జీవితం కాదని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సుధారాణి, లావేరు, ఎచ్చెర్ల, రణస్థలం, జి.సిగడాం, పొందూరు మండలాల కేజీబీవీ విద్యార్థులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం బిల్లుల తిరస్కరణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలానికి చెందిన 24 మంది ఎంపీటీసీలకు 18 నెలలుగా గౌరవ వేతనం అందజేయలేదు. వీరికి ప్రతి నెలా రూ.3000 అందజేయాల్సి ఉంది. మండల పరిషత్ అధికారులు బిల్లులు పెట్టినా ట్రైజరీ అధికారులు తిరస్కరించినట్లు తెలిసింది. ఎంపీటీసీలు వైఎస్సార్ సీపీకి చెందినవారు కావడంతో సకాలంలో గౌరవ వేతనాలు అందజేయటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గౌరవ వేతనం చెల్లించకపోవటం, ట్రెజరీ తిరస్కరణపై కోర్టును ఆశ్రయించేందుకు పలువురు ఎంపీటీసీలు సిద్ధమవుతున్నారు.

వైభవంగా వెంకన్న చక్రతీర్థ స్నానాలు



ఉత్సవమూర్తులకు అవభృథ స్నానం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయ వార్షిక తిరుక్కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం చక్రతీర్థ స్నానాలు ఘనంగా నిర్వహించారు. శ్రీకూర్మం దేవస్థానం అర్చకుడు గోపినంబాళ్ల నల్ల కూర్మాన్ పర్యవేక్షణలో, ఆలయ అర్చకులు బూరాడ వంశీకృష్ణ అర్చకత్వంలో స్వామివారి ఉత్సమూర్తులను నాగావళి నది నీటితో అవభృత స్నానాలు, వసంతోత్సవం జరిపించారు. ధ్వజావరోహణం, వేదస్వస్తి అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, ఆలయ కమిటీ సభ్యులు ఎల్.నందికేశ్వరరావు, మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

పోలీసుల నాకాబందీ



80 ఫీట్‌రోడ్ కూడలిలో కారును తనిఖీ చేస్తున్న సీఐ పైడపునాయుడు

జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి 9 గంటల నుంచి 11 గంటల వరకు పోలీసులు నాకా బందీ నిర్వహించాలని రాష్ట్ర డీజీపీ హరీష్‌గుప్తా నుంచి ఉత్తర్వులు రావడంతో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోనూ నాకాబందీ నిర్వహించారు. విజిబు ల్ పోలీసింగ్‌లో భాగంగా పలు చోట్ల ద్విచక్ర వాహనాలు, త్రీవీలర్, 4 వీలర్ వాహనాలను పోలీసులు ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్, అక్రమ రవాణా తదితర తనిఖీలు చేపట్టారు. శ్రీకాకుళం ఒకటో, రెండో పట్టణ సర్కిళ్ల పరిధుల్లో సీఐ సిహెచ్ పైడపునాయుడు, ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో ఏడు చోట్ల ఈ తనిఖీలు నిర్వహించారు. - శ్రీకాకుళం క్రైమ్



బలగ కూడలిలో ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేపడుతున్న పోలీసులు